క్లుప్తంగా

సమాచార హక్కు చట్టంపై అవగాహన

కురిచేడు: వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో నిర్వహించనున్నట్లు వ్యవసాయాధికారి పి. మధుబాబు తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజలు హాజరు కావాలని ఆయన కోరారు.

3న దర్శిలో రేషన్ బియ్యానికి వేలం

దర్శి: అక్రమమార్గంలో తరలిస్తూ పట్టుబడిన రేషన్ బియ్యానికి వచ్చే నెల 3వ తేదీన వేలం వేస్తున్నట్లు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల పట్టుబడిన సుమారు 4 వేల కేజీలు బియ్యానికి వేలం వేస్తున్నామన్నారు. వేలం పాటలో పాల్గొని ఎవరైనా బియ్యాన్ని పాడుకోవచ్చని చెప్పారు. పూర్తి వివరాలకు రెవెన్యూ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై మల్లికార్జున

దర్శి: యుక్త వయస్సు విద్యార్థినులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై మల్లికార్జున సూచించారు. స్థానిక ఊటుకూరి కోటయ్య హైస్కూల్లో యుక్త వయసు విద్యార్థులు నడుచుకోవాల్సిన తీరుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థినులకు మాయమాటలు చెప్పి మోస పుచ్చే అవకాశం ఉంటుదన్నారు. అలాంటి వారి మాటలు తప్పుగా ఉన్నాయా ఒప్పుగా ఉన్నాయా గమనించుకోవాలని సూచించారు. అవమానకరంగా ప్రవర్తిస్తే వెంటనే తెలియజేయాలన్నారు. పిల్లలు విద్య పైనే దృష్టి పెట్టి చక్కగా చదువుకోవాలని చెప్పారు.

ఇన్‌చార్జి హెచ్‌ఎంగా శ్రీనివాసరెడ్డి

పుల్లలచెరువు: స్థానిక జెడ్పీ పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎంగా శ్రీనివాసరెడ్డిని జిల్లా విద్యాశాఖ అధికారులు నియమించారు. పుల్లలచెరువులో పనిచేస్తున్న ఉమామహేశ్వరరావు పదవీ విరమణ చేయడంతో పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయుడైన శ్రీనివాసరెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాలపై పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా తోటి ఉపాధ్యాయుల సహకారంతో కృషి చేస్తానని చెప్పారు.

ఇసుక చోరీ

పెద్దారవీడు: మండల కార్యాలయంలో జగనన్న కాలనీల కోసం నిల్వ చేసిన ఇసుక చోరీకి గురైంది. పోలీసులు, హౌసింగ్ ఏఈ శ్రావ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల కార్యాలయం ఆవరణంలో హౌసింగ్ శాఖ తరఫున జగనన్న కాలనీల కోసం లారీల ద్వారా ఇసుకను డంప్ చేశారు. ఇక్కడి నుంచి మండలంలోని పలు గ్రామాల్లో జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణం కోసం లబ్ధిదారులు ట్రాక్టర్ల ద్వారా ఇసుక తీసుకెళ్తుంటారు. గత నెలలో ఇసుక డంపింగ్ నుంచి 10 ట్రాక్టర్ల ఇసుక గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లినట్లు గుర్తించారు. అప్పుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మళ్లీ మంగళవారం రాత్రి జేసీబీ సాయంతో దాదాపు 10 ట్రాక్టర్ల ఇసుక పోయినట్లు గుర్తించారు. బుధవారం డంపింగ్ దగ్గరకు వెళ్లి ఇసుకను పరిశీలించగా జేసీబీ టైర్లు, ట్రాక్టర్ల టైర్ల జాడ కనిపించింది. దాదాపు 20 ట్రాక్టర్ ఇసుక చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశామని శ్రావ్య తెలిపారు. ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

నల్లబజారుకు రేషన్ బియ్యం



పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం ఆటో (ఫైల్)



బుధవారం నుంచి పోలీసుస్టేషన్ వద్ద ఉన్న రేషన్ బియ్యం ఆటో

- రోజురోజుకూ పెరుగుతున్న అక్రమార్కులు
- పక్కదారి పడుతున్న పేదల బియ్యం
- రూ.లక్షలు ఆర్జిస్తున్న వ్యాపారులు
- కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా
- చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు

కురిచేడు: పేదలకు పట్టెడన్నం పెట్టాలన్న సంకల్పంతో ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా బియ్యం సరఫరా చేస్తోంది. అయితే ఆ బియ్యం నేడు పచ్చదండుకు ఆదాయ వనరుగా మారింది. ప్రస్తుత టీడీపీ నాయకుల కనుసన్నల్లో అక్రమార్కులు రోజురోజుకూ పేట్రేగిపోతున్నారు. కార్డుదారులకన్నా ముందుగానే అక్రమార్కులు వాటిని యథాతథంగా రైస్ మిల్లులకు అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు. రేషన్ డీలర్ల బియ్యం వ్యాపారం మూడు పువ్వులు..ఆరుకాయలుగా ఉండేందుకు పోటీ పడుతున్నారు. ఇదే అదనుగా భావించిన నాయకులు లక్షల రూపాయలు వసూలు చేసి అక్రమ రేషన్ మాఫియాకు సహకరించాలని అధికారులకు హుకుం జారీ చేస్తున్నారు. దీన్ని గమనించిన కార్డుదారులు సైతం బియ్యం తినకుండా వ్యాపార వస్తువుగా చూస్తున్నారు.

మూడంచెలుగా ధరలు

కార్డుదారుల వద్ద రేషన్ డీలర్లు కిలో 10 రూపాయలు చొప్పున కొనుగోలు చేస్తున్నారు. వారి వద్ద నుంచి సిండికేటుదారులు కిలో రూ.13 నుంచి 16 రూపాయల వరకు కొనుగోలు చేసి మిల్లులకు చేరవేస్తున్నారు. వారి వద్ద నుంచి మిల్లర్లు కిలో 20 నుంచి 25 రూపాయల వరకు కొనుగోలు చేసి వాటిని పాలిష్ చేసి సన్న బియ్యంలో కలిపి కిలో 50–60 రూపాయలకు విక్రయిస్తున్నారు. ఈ దందాను అడ్డుకోవద్దని టీడీపీ నాయకులు అధికారులకు హుకుం జారీ చేశారు.

20 రోజుల్లో మూడు వాహనాలు పట్టివేత

ఈ నెలలో గడిచిన 20 రోజుల్లో అక్రమ మార్గంలో రేషన్‌షాపుల నుంచి రైస్ మిల్లులకు తరలి వెళ్తున్న బియ్యాన్ని మూడు సార్లు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 8వ తేదీన మర్రిపూడి నుంచి వినుకొండ తరలుతున్న 58 టిక్కీల రేషన్ బియ్యం ఆటోను పోలీసులు దర్శి రోడ్డులోని కాలువ వద్ద పట్టుకున్నారు. 9వ తేదీ త్రిపురాంతకానికి చెందిన ఇమ్మడిశెట్టి సుబ్బారావు వాహనం 60 బస్తాల రేషన్ బియ్యంతో వినుకొండ సాంబయ్య మిల్లుకు తరలుతుంటే దాన్ని మండలంలోని కల్లూరుకు చెందిన కొందరు ఆపి దర్శి రోడ్డులోని పెట్రోలు బంకులో ఉంచి కొత్త నాటకానికి తెరలేపారు. ఆ విషయం రెవెన్యూ అధికారులకు తెలిసి వీఆర్‌ఏ కంభంపాటి బాలనాగయ్యను వాహనం వద్ద కాపలాగా ఉంచారు. ఈ నేపథ్యంలో ఆయన్ను బెదిరించి వాహనం ఉడాయించి మిల్లుకు చేరింది. దానిపై వీఆర్‌ఏ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసి 15 రోజులైనా దానిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం పలు విమర్శలకు తావిస్తోంది. ఆ ఘటన మరువకముందే బుధవారం రాత్రి 10 టిక్కీల రేషన్ బియ్యంతో మరో ఆటోను కల్లూరుకు చెందిన ఇద్దరు పోలీసులకు అప్పగించారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎక్కడ?

మండలంలో గడిచిన 20 రోజుల్లో మూడు సార్లు రేషన్ అక్రమ రవాణాను పట్టుకున్నా ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు స్పందించిన దాఖలాలు లేవు. ఎక్కడా వారు అక్రమ రేషన్ బియ్యం రవాణాను అడ్డుకోక పోవడంతో భారీ స్థాయిలో ముడుపులు వారికి చెందాయని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. గతంలో ఎక్కడ బియ్యం పట్టుకున్నా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు లేక సెబ్ అధికారులు క్షణాల్లో ప్రత్యక్షమయ్యేవారు. ప్రస్తుత తరుణంలో వారు కనుమరుగవడంతో ప్రజల విమర్శలకు బలమిస్తోంది.

గోతులమయమైన గ్రామీణ రోడ్లు



త్రిపురాంతకం-చెర్లోపల్లి సమీపంలో దెబ్బతిన్న రోడ్డు



మిట్టపాలెం వద్ద..

త్రిపురాంతకం: మండలంలో గ్రామీణ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. త్రిపురాంతకం నుంచి నియోజకవర్గ కేంద్రం యర్రగొండపాలెం వెళ్లే రహదారి గోతులమయమై పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. త్రిపురాంతకం నుంచి యర్రగొండపాలెం వరకు 18 కిలోమీటర్లు దూరం ఉంది. నిత్యం రద్దీగా ఉండే రోడ్లలో ఇది ఒకటి. రోడ్డుపై పెద్దపెద్ద గోతులు పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మరింత దెబ్బతింది. కనీసం మరమ్మతులు చేసే పరిస్థితి కనిపించడం లేదు. మూడు నెలలుగా రోడ్డు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అయినా అధికారులు పట్టించుకునే పరిస్థితులు కనిపించడం లేదు. ఈ రహదారిలో చెర్లోపల్లి, మిట్టపాలెం, రామసముద్రం, అయ్యంబొట్లపల్లి, బ్రాహ్మణపల్లి, గోళ్లవిడిపి గ్రామాలు ఉన్నాయి. త్రిపురాంతకం–యర్రగొండపాలెం రోడ్డులో తరుచూ నియోజకవర్గానికి పనులపై వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. ఈ రోడ్డుపై పర్లాంగు దూరం ఒకే గేర్లో ప్రయాణించే పరిస్థితి లేదంటే ఈ రోడ్డు ఎంత గోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణం చేయాలంటే తీవ్రంగా ఇబ్బంది ఏర్పడింది. ఇక చిన్న కార్లలో ప్రయాణించే వారి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. రహదారి దెబ్బతినడంతో తరుచూ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రమాదాల నివారణకు రోడ్డు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. రోడ్డుపై కారును తిప్పుతూ గమ్యం చేరాల్సిందే. 18 కిలోమీటర్లలో సుమారు పది కిలోమీటర్ల మేర పూర్తిగా గుంటలమయమైంది. రోడ్డుకు మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



రామసముద్రం సమీపంలో..



బ్రాహ్మణపల్లి సమీపంలో..

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి



కబడ్డీ ఆడుతున్న బాలికలు

యర్రగొండపాలెం: క్రీడలు మానసికాభివృద్ధి, శారీరక దృఢత్వంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. స్థానిక జ్యోతిరావు పూలే బాలుర రెసిడెన్షియల్(దేవరాజుగట్టు) స్కూల్లో గురువారం జరిగిన నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ప్రతి పాఠశాలలో పాఠాలతో పాటు ఆటలను దినచర్యలో భాగంగా ఉండేవిధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. పోటీల్లో నియోజకవర్గంలో ఉన్న 5 మండలాలకు చెందిన 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ పోటీల్లో గెలుపొందిన టీమ్‌లు శుక్రవారం నుంచి ఒంగోలులో జరిగే జిల్లా స్థాయి ఆటల పోటీల్లో పాల్గొంటాయని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. పీడీలు దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్ హ్యానేనాయక్, రామ్మోహన్‌రెడ్డి,రామానాయక్,మత్తయి పాల్గొన్నారు.

చిరు వ్యాపారికి ఆర్థిక సాయం

యర్రగొండపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట చిరువ్యాపారం చేసుకుంటున్న సూరె కిశోర్‌కు చైతన్య జ్యోతి ఫ్రెండ్స్ సర్కిల్ గురువారం రూ.6 వేల ఆర్థిక సాయం చేశారు. ఆ వ్యాపారి కాళ్లకు ఇన్‌ఫెక్షన్ రావడంతో వైద్యులను ఆశ్రయించాడు. అందుకు సంబంధించిన ఆపరేషన్‌కు రూ.1.50 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు స్పష్టం చేశారు. అంత ఖర్చు పెట్టేందుకు తన వద్ద డబ్బు లేదంటూ ఆయన కొంతకాలంగా మందులతో సరిపెట్టుకుంటున్నాడు. ఆ వ్యాధి రోజురోజుకూ ముదురుతుండటంతో ఫ్రెండ్స్ సర్కిల్ చేయూత అందించింది.

విద్యార్థులకు చక్కటి బోధన చేయాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో ఇందిర

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉపాధ్యాయులు చక్కటి బోధన చేసే విధంగా కృషి చేయాలని ఎంఈవో ఇందిర పేర్కొన్నారు. గురువారం ఆమె పిసి తండా పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నోట్ పుస్తకాలను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన పద్ధతులను అనుసరిస్తూ విద్యార్థులకు బోధన చేయాలన్నారు. రోజూ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారి సామర్థ్యాలు పెరిగే విధంగా చూడాలన్నారు. విద్యార్థులంతా రోజూ పాఠశాలకు వచ్చే విధంగా ఉండాలన్నారు. మధ్యాహ్న భోజనం ప్రభుత్వ నియమాలను అనుసరించి రుచికరమైన, నాణ్యంగా ఉండేలా ఉపాధ్యాయులు చూడాలని చెప్పారు.

రెవెన్యూ శాఖలో బదిలీలు

పుల్లలచెరువు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కిశోర్‌బాబును మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయానికి, ఆర్‌ఐ ప్రసాద్‌ను దోర్నాల ఆర్‌ఐగా, జూనియర్ అసిస్టెంట్ కృష్ణ యర్రగొండపాలేనికి, యర్రగొండపాలెం గోడౌన్ డీటీగా పనిచేస్తున్న తిరుపతిరెడ్డిని పుల్లలచెరువు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా జిల్లా అధికారులు నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

సమస్యల పరిష్కారమే ఏఐఎస్‌టీఈఏ లక్ష్యం



మాట్లాడుతున్న సాంబశివరావు

దర్శి: గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ఏఐఎస్‌టీఈఏ లక్ష్యమని స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇండ్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలో దర్శి ప్రాంతీయ మండల అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు అధ్యక్షతన గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ సంఘం ఏర్పడి 60 సంవత్సరాలైన సందర్భంగా ఒంగోలు పట్టణంలో డైమండ్ జూబ్లీ కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షులు, గౌరవాధ్యక్షులు కె.నరేంద్ర, బాలాజీనాయక్‌ల ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. ఈ నెల 29వ తేదీన ఆదివారం అంబేడ్కర్ భవన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ప్రాంతీయ మండలాల నుంచి అధిక సంఖ్యలో గిరిజన ఉద్యోగులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. గిరిజన ఉద్యోగమిత్రుల సమస్యల పరిష్కారానికి జిల్లా, రాష్ట్ర శాఖల ఆధ్వర్యంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

కళకళలాడుతున్న పొలాలు



ఏపుగా పెరిగిన కంది పంట



ఆముదం పంట..

దొనకొండ: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో గ్రామాల్లోని రైతులు సాగు చేసిన కంది, ఆముదం, పత్తి, మిరప పంటలు కళకళలాడుతున్నాయి. దీంతో గ్రామాల్లోని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రెండు తుఫాన్‌లు, రుతుపవన వర్షాలు కురవడంతో సాగు చేసిన పొలాలు ఏపుగా పెరిగాయి. ఇంకా 20 రోజులకు ఆముదం పంట రైతులకు అక్కరకు వస్తుంది. మండలంలో 8 వేల ఎకరాల్లో ఆముదాలు, 4 వేలు కంది, 6 వేలు పత్తి, 7 వేల ఎకరాల్లో మిరప సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అంచనా. ఈ ఏడాది మంచి రేట్లు రావచ్చని, మెట్ట ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా అడ్డరోడ్డు



అడ్డ రోడ్డులో నిలిచిన నీరు

దొనకొండ: స్థానిక నాలుగు రోడ్ల కూడలి రోడ్డు అధ్వానంగా తయారైంది. దొనకొండ నుంచి పొదిలి, దర్శి, కురిచేడు ప్రాంతాలకు వాహనాలు నిత్యం వెళ్తుంటాయి. వర్షం పడితే చిత్తడే. నీరు నిల్వ ఉండి వాహనాలు వెళ్లినప్పుడు పక్కనే పోయే వాహన చోదకులు, పాదాచారులపై మురుగు నీరు పడుతోంది. దీంతో చాలా మంది ప్రయాణాలు మానుకుని ఇంటికి పోవాల్సి వస్తోంది. అంతేకాకుండా చిరు వ్యాపారులకు చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. మండలంలోని అన్ని గ్రామాల నుంచి నిత్యం ప్రజలు అడ్డరోడ్డుకు అవసరం కోసం వెళ్తుంటారు. అధ్వానంగా ఉందని చాలా సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, రాత్రి వేళల్లో వీధిలైట్లు లేక పోవటంతో కుక్కల బెడద ఉంటుందని, మరి ముఖ్యంగా మహిళ ఒంటరిగా ఇంటికి వెళ్లడానికి ఇబ్బందిగా ఉంటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అడ్డ రోడ్డులో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సుధాఅచ్చయ్య

దర్శి: గర్భిణీలు, బాలింతలు తప్పని సరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీపీ గోళ్లపాటి సుధారాణి సూచించారు. పట్టణంలోని పౌష్టికాహార మాసోత్సవాలు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ సీహెచ్ భారతి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుధారాణి మాట్లాడుతూ గర్భిణీ పౌష్టికాహారం తీసుకుంటే బిడ్డ పిండం దశ నుంచి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అంగన్‌వాడీలు అందించే బాల సంజీవని కిట్టును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిరు ధాన్యాలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకుంటే స్త్రీలలో అనీమియా నిర్మూలించేందుకు సాధ్యపడుతుందన్నారు. సైంటిస్ట్ మానస మాట్లాడుతూ కిశోర బాలికలకు రక్తహీనత, చిరుధాన్యాల ఆవశ్యకత గురించి వివరించారు. ఐటీసీ ప్రథమ డిస్టిక్ కో ఆర్డినేటర్ ఎస్.వెంకట్రావు మాట్లాడుతూ అంగన్‌వాడీలో మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు అందించే పూర్వ ప్రాథమిక విద్య గురించి వివరించారు. ఎంఈఓలు కాకర్ల రఘురామయ్య, రమాదేవి, ఏపీఓ కళ్యాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.అనూరాధ పాల్గొన్నారు.

యూటీఎఫ్‌కు 50 వసంతాలు పూర్తి



మాట్లాడుతున్న ఎంఈఓ సాంబశివరావు

దొనకొండ: మండలంలో యూటీఎఫ్ యూనియన్ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవంపై మండలాభివృద్ధి కార్యాలయంలో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో యూటీఎఫ్ 1974 ఆగస్టు 10న ఏర్పాటు చేశారు. నేటికి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10 రోజుల క్రితం ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు కాకినాడలో డిసెంబర్ 14, 15, 16 తేదీల్లో జరుగుతున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. మండలంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డు పొందిన ఉపాధ్యాయులను, వివిధ రంగాల్లో నైపుణ్యం పొందిన 19 మందిని ఎంపిక చేసి మండల విద్యాధికారులు ఎస్.సాంబశివరావు, షేక్ అమీర్‌బాషా చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యతో పాటు ఆటల పోటీల్లో కూడా నైపుణ్యం పెంచుకుని విద్యార్థులను అన్ని రంగాల్లో సమాజంలో మెలిగే విధంగా చూడాలని చెప్పారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, జెడ్పీటీసీ సుధాకర్, తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీఓ వి.వసంతరావునాయక్, యుటీఎఫ్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, గౌరవ అధ్యక్షుడు ప్రభుదాసు, యూటీఎఫ్ నాయకులు అంజినాయక్, లత, రోశయ్య, మండల స్థాయి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు రక్తహీనతపై అవగాహన



కిశోర బాలికలకు అవగాహన కలిగిస్తున్న సూపర్‌వైజర్ నాగమణి

కురిచేడు: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజరు ఆర్.నాగమణి ఆధ్వర్యంలో గురువారం రక్తహీనతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాలికలకు 100 రోజుల కార్యక్రమం గురించి వివరించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ కిశోర బాలికగా ఉన్నప్పటి నుంచి పోషకాహారం, సమతుల్య ఆహారం, ఐరన్, పోషణ, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్యవివాహాల గురించి వివరించారు. ఇటువంటి విషయాలన్నింటిపై అవగాహన కలిగినప్పుడే రాబోయే తరాల్లో రక్తహీనత లేని పిల్లలను భావితరాలకు అందించనున్నట్లు వివరించారు. చిరుదాన్యాలు, ఆకుకూరలు, పప్పుదినుసులు ఆహారంలో చేర్చుకోవాలని వివరించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్త షేక్ ఫాతిమా, కిశోర బాలికలు పాల్గొన్నారు.